క్లుప్తంగా

చివర్లు తుంచి నాటాలి..



జమ్ముపేటలో అవగాహన కల్పిస్తున్న ఏఓ తిరుపతిరావు

గుర్ల: వరి నారు చివర్లు తుంచి నాటడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ ఎ.తిరుపతిరావు అన్నారు. మండలంలోని జమ్ముపేటలో జరుగుతున్న వరి నాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చివర్లు తుంచడం వల్ల కాండంతొలుచు పురుగు ఆశించదన్నారు. నాట్లు వరుసుక్రమంలో నాటడం వల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగులుతుందని చెప్పారు. అనంతరం గరిడలో ప్రకృతి సాగులో భాగంగా చేపడుతున్న వరి పంటను పరిశీలించారు.

అనుమతులు తప్పనిసరి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): వినాయక నవరాత్రుల్లో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న వినాయక మంటపాలకు సంబంధించి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై బి.లోకేశ్వరరావు తెలిపారు. గరివిడి పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మంటపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులను చైతన్యపరచాలన్నారు. అదేవిధంగా ఎవరి వద్దనైనా నాటు తుపాకీలుంటే స్వచ్ఛందంగా అప్పగించాలన్నారు.

23న ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు

- డీఎల్‌డీఓ హేమసుందరరావు



చీపురుపల్లి: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23న డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలతో పాటు అవగాహన ర్యాలీలు నిర్వహించాలని డివిజినల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) కె.హేమసుందరరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రామస్థాయిలో స్వచ్ఛందంగా సేవలు అందించిన వారిని సత్కరించాలని తెలిపారు. మురుగునీటి కాలువల్లో బురద, మట్టిని తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే యాంటీ లార్వా, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య పనుల విషయంలో మండల స్థాయిలో ఎంపీడీఓలు, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

మిగులు సీట్లు వినియోగించుకోవాలి

గంట్యాడ: మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి మిగులు సీట్లు ఉన్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో మెరుగైన బోధన ఉంటుందని పేర్కొన్నారు.


కషాయాలతో తెగుళ్ల నివారణ



ఓబలయ్యపాలెంలో దశపర్ణి కషాయం తయారీపై వివరిస్తున్న డీపీఎం ఆనందరావు

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కషాయాలతో తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని ఓబలయ్యపాలెం, బొద్దాం, పాటూరు గ్రామాల్లో గురువారం పర్యటించి కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో సుస్థిర వ్యవసాయకేంద్రం కో ఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

190 పింఛన్ల తొలగింపు



తొలగించిన పింఛన్‌దారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీలలో అర్హత లేని కారణంగా 190 మంది దివ్యాంగుల పింఛన్లు తొలిగించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పునరుద్ధరణ కోసం పలువురు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 235 దివ్యాంగుల పింఛన్లలో 45 మందిని వృద్ధాప్య పింఛన్‌కు మార్చామన్నారు. మిగిలిన 190 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వారు మరలా అప్పీల్ చేసుకునేందుకు అవకాశం కల్పించామని పాత, కొత్త సదరం సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

స్థాయి పెంచారు.. అభివృద్ధి మరిచారు..

- భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న పశు వైద్యాధికారులు
- కనీస సౌకర్యలు లేని ఏరియా ఆస్పత్రి
- ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి



శిథిలావస్థలో కిటికీలు



పెచ్చులూడుతున్న శ్లాబు

గుర్ల: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రానికి స్థాయి పెంచారు తప్ప మౌలిక సదుపాయాలు కల్పించడం మాత్రం మరిచారు. ఊరు గొప్ప ..పేరు దిబ్బ అన్నట్లు ఉంది గుర్ల పశువైద్య కేంద్రం పరిస్థితి. మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యకేంద్రాన్ని ఏరియా ఆస్పత్రిగా మార్చారు. ఈ ఏరియా ఆస్పత్రి పరిధిలో గుర్ల, గరివిడి మండలాలున్నాయి. పశు వైద్యకేంద్రంలో ఉన్న రెండు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల శ్లాబు పెచ్చులూడి పడిపోతున్నా ఆ భవనాల్లోనే విధులు నిర్వహించాల్సి వస్తోంది. వాటి వల్ల సిబ్బంది ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. వర్షా కాలంలో అయితే వీరి పరిస్థితి మరింత అగమ్యగోచరంగా తయారవుతోంది. విధులు నిర్వహించడం మాట పక్కనబెడితే కనీసం మందులు దాచుకోవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. సిబ్బంది ఉన్న భవనంతో పాటు పశువులకు వైద్యం అందించే షెడ్ కూడా శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. దీని వల్ల పశువులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుర్ల పశువైద్య కేంద్రం

ఊడుతున్న పెచ్చులు..

ఏరియా ఆస్పత్రిలో ఉన్న భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో.. సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో శ్లాబ్ పెచ్చులూడుతున్నాయి. దీంతో ఆస్పత్రిలో ఉన్న పరికరాలు పాడవుతున్నాయి. దీనివల్ల పాడి పశువులకు వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు.

ప్రతిపాదనలు పంపించాం..



మండల కేంద్రంలోని ఏరియా పశు వైద్య కేంద్రంలో భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. భవనాల మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వస్తే నిర్మాణాలు చేపడతాం.
టి.రమణాచలం, పశుసంవర్థక శాఖ ఎ.డి., గుర్ల

పేద విద్యార్థులను ఆదుకోండి



చీపురుపల్లి: మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ నాయకులు

చీపురుపల్లి: ప్రభుత్వం ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వెంకీ కోరారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి మూడురోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ డి.ధర్మరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకీ మాట్లాడుతూ.. విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలు తక్షణమే విడుదల చేయాలి కోరారు. ఉపకార వేతనాలపై ఆధారపడి చదువుతున్న పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.6,800 కోట్ల ఉపకార వేతన బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. అలాగే పీజీలో చేరిన విద్యార్థులకు జీఓ 77ను సాకుగా చూపి ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని.. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలన్నారు. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థినులకు కాస్మొటిక్ చార్జీలను మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇవ్వాలన్నారు. విద్యార్థి సంఘాలను ఏర్పాట చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని.. అలాంటి హక్కును కాలరాస్తూ రాజ్యాంగ విరుద్ధంగా తీసుకొచ్చిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 25న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, సభ్యులు భారతి, నాని, చీపురుపల్లి మండల కమిటీ సభ్యులు తేజ, శ్రీలత, మధులత, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం రూరల్: ధర్నా చేస్తున్న విద్యార్థులు

సమస్యలను పరిష్కరించాలి..

గజపతినగరం రూరల్: డిగ్రీ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు చేయడంతో పాటు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాము కోరారు. నియోజకవర్గ కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో 2019లో ఏర్పాటైన డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కళాశాలల్లో ల్యాబ్‌లు, గ్రంథాలయాలు లేకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో శిరీష, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన

కొత్తవలస/లక్కవరపుకోట: చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకురాలేకపోతున్నామని, ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో కొత్తవలస మండలంలోని మూడురోడ్ల జంక్షన్ నుంచి కార్యకర్తలందరూ నల్లటి చీరలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ పి. అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. అలాగే లక్కవరపుకోట మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది నిరసన చేపట్టి, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.



కొత్తవలస :మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి..

గజపతినగరం: తమను పూర్తిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా వి. లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. కనీస వేతనాలు పెంచడంతో పాటు అధిక పని ఒత్తిడి నుంచి తప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుభాషిని, పి.జ్యోతిలతో పాటు డి.నాగమణి, బి.పైడిరాజు, బి.సుజాత, కె.రమణమ్మ, బి.పద్మ, దమయంతి, జి.సన్యాసమ్మ పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. జీతాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రాములమ్మకు వినతిపత్రం అందజేశారు.



గజపతినగరం: ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



వేపాడ: తహసీల్దార్ రాములమ్మకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయాలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్ల: మండలంలోని నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలోని సదానందపురం, తాటిపూడి, గొలగాం, వల్లాపురం, దమరసింగి, శేషపుపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నారంనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వినియోగదారులు సహకరించాలి..

గంట్యాడ: గంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో గల గింజేరు గ్రామానికి వెళ్లే రహదారిలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జామి: విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని ఈఈ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జామి మండలం లక్ష్మీపురం, పావాడ, జాగరంతో పాటు ఎల్.కోట మండలంలోని నాయుడుపేట, వీరభద్రపేట.. ఎస్.కోట మండల పరిధిలోని ఆలుగుబిల్లి పరిసర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి ఆర్యవైశ్యులు రూ. 30 వేల ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. గరివిడిలో నివాసం ఉంటున్న ఆర్యవైశ్యుడు మామిడిపాక పైడిరాజు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న గరివిడి ఆర్యవైశ్య మిత్రుల చారిటీ సంస్థ సభ్యులు రూ. 25 వేలు.. అలాగే జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివారావు అందించిన రూ. ఐదు వేలు గురువారం బాధిత వ్యక్తికి అందజేశారు.

జాబితాలో ఉన్నవారికే ఇంటికి సరుకులు

మెరకముడిదాం: ప్రభుత్వం జారీచేసిన జాబితాలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులకు మాత్రమే ఇంటి వద్ద సరుకులు అందజేయాలని తహసీల్దార్ సులోచనారాణి తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలానికి చెందిన రేషన్‌డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం వయోవృద్ధులు, దివ్యాంగుల జాబితాలను జారీ చేసిందని.. ఆ జాబితాల ప్రకారం ప్రతి నెలా 25వ తేదీలోపు ఇంటింటికీ వెళ్లి సరుకులు అందజేయాలన్నారు. త్వరలో స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రేషన్‌డీలర్లు సెలవు పెడితే తహసీల్దార్‌కు, సీఎస్‌డీటీకి ముందుగా తెలియజేయాలన్నారు.

తవ్వేకొద్దీ అక్రమాలే..

- ఎమ్మెల్సీ రఘురాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: జిందాల్ భూ సేకరణలో తవ్వేకొద్దీ అక్రమాలు బయట పడుతూనే ఉన్నాయని, ఒక్కొక్కటిగా నిరూపిస్తూ, తగిన ఆధారాలు చూపించినా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుందే తప్ప నిర్వాసితులకు న్యాయం చేయడం లేదని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాడు బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ తప్పుగా చెప్పి మోసం చేశారని ఆరోపించారు. 2007 నాటి భూమి విలువకు 2.5 రెట్లు అదనపు పరిహారం లెక్కగట్టి పంచాయతీని బట్టి రూ. 4.5 లక్షల నుంచి ఆరు లక్షల రూపాయల వరకు ఇవ్వాల్సి ఉందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ భూసేకరణలో జిరాయితీ, డి.పట్టా భూములకు ఒకే ధర చెల్లించి.. ఇక్కడ మాత్రం గిరిజనాన్ని దగా చేసి డీ పట్టా భూములు కాజేశారన్నారు. జిందాల్ చేసిన మోసం, దగా, కుట్రలపై ఇప్పటికే న్యాయస్థానాలను ఆశ్రయించామని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు గోవింద, మాజీ సర్పంచ్ వెంకటరావు మాట్లాడుతూ.. జిందాల్ నిర్వాసితులకు అండగా ఉంటామన్నారు.

సంక్షేమ సంఘాలు ఎక్కడ..!



నిరసన తెలియజేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: భూములు కోల్పోయి రెండు నెలలుగా రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నా ఏ ఒక్క సంఘ సభ్యులు కూడా తమను పట్టించుకోవడం లేదని జిందాల్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మా కష్టాలు ఎవ్వరికీ పట్టడం లేదన్నారు. కొన్ని వర్గాలు, సమూహాలకు మాత్రమే మద్దతు పలికే సంక్షేమ సంఘాలు తమనెందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



ఎస్.కోటలో మట్టి గణపతులు పంచుతున్న జియో సభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో గురువారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ వేలూరి సీతారత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంగులు, రసాయనాలు, థర్మాకోల్, జిప్సం, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఎనామిల్ రంగులు వేసిన విగ్రహాల వల్ల పర్యావరణం పాడవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జియో వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ, సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి, బి.అప్పారావు, మోక్ష విద్య యోగామందిర్ వ్యవస్థాపకులు శీలా కోటేశ్వరరావు, కె.మంగరాజు, లాస్యశ్రీ, హృషీకేష్, ఎ.ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి పవిత్రోత్సవాలు

జామి:

మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాత్రి వేదపారాయణం, స్వామివారికి మహానివేదన చేపట్టారు. అలాగే గురువారం ఉదయం విశేష హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.



పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

కొత్తవలస: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలను అందించాలని ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ సూచించారు. మండల కేంద్రంలో గల పీహెచ్‌సీ భవనం వద్ద ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 44 వేలతో ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పించాలని తీర్మానించారు. అనంతరం ఎంపీపీ గోపెమ్మ మాట్లాడుతూ.. నూతన ఆస్పత్రి నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సీతల్‌వర్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్యరామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వితరణ



కుమ్మపల్లి నిరాశ్రయులకు వంటపాత్రలు, రగ్గులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు

వేపాడ: మండలంలోని కుమ్మపల్లిలో నిరాశ్రయ బాధితులకు రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు శుక్రవారం వంటపాత్రలు, రగ్గులు అందజేశారు. గత ఆదివారం కురిసిన వర్షాలకు గ్రామానికి చెందిన రెండు పూరిళ్లు పడిపోయిన సంగతి తెలిసిందే. దీంతో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కమిటీ సభ్యులు బాధిత కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. కార్యక్రమంలో పి.వరలక్ష్మి, దొడ్డి సూర్యారావు, ఎ.మల్లేశ్వరరావు, డాక్టర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తీసుకోవాల్సిందే..



సీఐ షణ్ముఖరావు

కొత్తవలస: వినాయక మంటపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాల్సిందేనని సీఐ సీహెచ్ షణ్ముఖరావు తెలిపారు. గురవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంటపం ఏర్పాటు చేయబోయే ప్రదేశం, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు, విగ్రహం ఎత్తు, ఎన్ని రోజులు నిలుపుతారు, అనుపు సమయంలో విగ్రహాన్ని ఎలా ఊరేగిస్తారు.. తదితర అన్ని అంశాలు తెలియజేస్తూ దరఖాస్తు అందజేయాలన్నారు. అలాగే మంటపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

దత్తిరాజేరు: గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారసత్వ భూముల కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వీఆర్‌ఓలందరూ గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ వరప్రసాద్, రీసర్వే డీటీ రత్నకుమారి పాల్గొన్నారు.

నేడు బానాదిలో ఉచిత వైద్యశిబరం

వేపాడ: మండలంలోని బానాదిలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కండిపల్లి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పటల్ ఆధ్వర్యంలో రమేష్ సహకారంతో నిర్వహించే శిబిరంలో రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేస్తామన్నారు.